తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి. చిత్రంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, బీఆర్‌ఎస్ నేత యాదయ్యగౌడ్

గ్యారెంటీలపై పొంతనలేని వ్యాఖ్యలు

- సీఎం ఒకటి చెప్తే.. మంత్రులు మరొకటి
- అధికారం కోసమే నాడు అడ్డగోలు హామీలు
- స్పీకర్ మాటలతో కాంగ్రెస్ మోసం తేటతెల్లం
- శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి
- అధికార కాంగ్రెస్.. 420 పార్టీ: గొంగిడి సునీత

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ గ్యారెంటీలపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంతనలేని వ్యాఖ్యలు చేస్తున్నారని శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో గురువారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, బీఆర్‌ఎస్ నేత యాదయ్యగౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి రావడం కోసమే నాడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు అడ్డగోలు హామీలు ఇచ్చినట్టు స్పీకర్ వ్యాఖ్యలతో మరోసారి రుజువైందని తెలిపారు. ఆర్థిక పరిస్థితి లోతు తెలియక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీలిచ్చిందని స్వయంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యానించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. 13 నెలల తర్వాత స్పీకర్‌కు ఈ విషయం బోధపడిందా? అని ప్రశ్నించారు. ఎన్నికల హామీల అమలుపై రేవంత్ సర్కారు చేతులెత్తేసిందా? అని నిలదీశారు. 'ఎన్నికల సమయంలో ఇన్ని హామీలు ఎలా అమలు చేస్తారని మీడియా అడిగితే.. 'అప్పులు తెలుసు. తప్పులు తెలుసు. ఆదాయం సమకూర్చుకొనే మెళకువలూ తెలుసు. ఆర్థిక పరిస్థితిపై మాకు అవగాహన ఉన్నది' అని భట్టి విక్రమార్క సహా కాంగ్రెస్ నేతలు నాడు ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. గ్రామసభలు, సమావేశాలు మొత్తం డొల్లా అని చెప్పారు. అప్పుల గురించి కూడా కాంగ్రెస్ నేతలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 1.43 లక్షల కోట్లు అప్పులు చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో అప్పులబాధతోపాటు రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాక్షేమాన్ని గాలికొదిలిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజాక్షేత్రంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం మెడలు వంచి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యేలా చూస్తామని చెప్పారు. ఇచ్చిన 420 హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీ చార్‌సౌబీస్ (420) పార్టీగా మారిందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత విమర్శించారు. కేసీఆర్‌పై అబద్ధాలను ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు గోబెల్స్‌ను మించిపోయారని మండిపడ్డారు. గాంధీ విలువలను కేసీఆర్ పాటిస్తే.. వాటిని కాంగ్రెస్ పాలకులు తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు.

కాంగ్రెస్‌ది నమ్మక ద్రోహం: కొప్పుల

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో అధికారంలోకి వచ్చి 420 రోజులు గడిచినప్పటికీ ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. అలవికాని హామీలను నమ్మి అధికారం కట్టబెట్టిన తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ నమ్మించి మోసం చేసిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ 420 హామీలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు ప్రశ్నిస్తే ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతూ అరెస్టులు చేయిస్తున్నదని తెలిపారు. 420 హామీలను నెరవేర్చే వరకు ఎన్ని కేసులు పెట్టినా తెలంగాణ ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ నిలదీస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

కేసులకు బెదరం... పోరాటం ఆపం

బీఆర్‌ఎస్ నేత రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రశ్నించడం ఆపబోమని, ప్రజల పక్షానపోరాటం చేస్తూనే ఉంటామని బీఆర్‌ఎస్ నేత గోగుల రవీందర్‌రెడ్డి స్పష్టంచేశారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు ఆధారంగా తనపై అక్రమ కేసు నమోదు చేశారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ లీగల్ సభ్యుడు, న్యాయవాది జక్కుల లక్ష్మణ్‌తో కలిసి గురువారం నాంపల్లి కోర్టులో హాజరైనట్టు తెలిపారు. విచారణను కోర్టు మార్చి 21కి వాయిదా వేసిందని చెప్పారు. కోల్ స్కామ్‌కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, గడ్డం వినోద్‌ను ప్రశ్నించినందుకు తనపై కాంగ్రెస్ సర్కార్ అక్రమ కేసు నమోదు చేసిందని తెలిపారు. అఘమేఘాల మీద తనపై పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారని, బీఆర్‌ఎస్ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్నారని చెప్పేందుకు ఇదే నిదర్శనమని చెప్పారు. ఎన్ని రకాలుగా వేధించాలని చూసినా భయపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. న్యాయమే గెలుస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

మెడికల్ సీట్లపై సర్కారు పోరాడాలి

- సుప్రీం తీర్పుపై సీఎం రేవంత్ అప్పీల్‌కు నివేదించాలి
- ప్రభుత్వం సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి వెళ్లాలి
- కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- లేదంటే తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరిగే ప్రమాదం
- మెడికల్ పీజీ లోకల్ కోటా-సుప్రీం తీర్పుపై హరీశ్ ఆందోళన

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): పీజీ మెడికల్ సీట్లలో 50 శాతం లోకల్ రిజర్వేషన్ చెల్లదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో తెలంగాణతోపాటు, దక్షిణాది రాష్ర్టాల విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. మెడికల్ కాలేజీల్లో అగ్రగామిగా ఉన్న తెలంగాణలో ఈ తీర్పు వల్ల స్థానిక విద్యార్థులు వైద్య విద్య అభ్యసించే అవకాశం కోల్పోయే ప్రమాదమున్నదని పేర్కొన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత వైద్య విద్య అభివృద్ధికి తొలి సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణలో 5 మెడికల్ కాలేజీలుంటే ఆ సంఖ్యను కేసీఆర్ ప్రభుత్వం 34కు పెంచిందని తెలిపారు. దీంతో ప్రతీ లక్ష జనాభాకు 19 ఎంబీబీఎస్ సీట్లతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, పీజీ సీట్లలో రెండో స్థానానికి చేరిందని చెప్పారు. 2025 నాటికి తెలంగాణలో 2924 పీజీ సీట్లు ఉండగా, 50 శాతం లోకల్ రిజర్వేషన్ ప్రకారం, 1462 పీజీ సీట్లు తెలంగాణ ప్రాంత విద్యార్థులకు మాత్రమే వచ్చేవని వివరించారు. కానీ సుప్రీంకోర్టు తీర్పుతో ఇవి కూడా ఆల్ ఇండియా కోటాలోకి వెళ్లిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణలో ఉంటూ మెడికల్ పీజీ చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఇది శరాఘాతంగా మారుతుందని చెప్పారు. తెలంగాణతోపాటు, దక్షిణాది రాష్ర్టాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఏపీ విద్యార్థులు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. దక్షిణాది రాష్ర్టాలు గత 77 ఏండ్లుగా వైద్య విద్యపై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల వైద్యవిద్యకు కేరాఫ్‌గా మారాయని చెప్పారు. దేశంలో సగటున ప్రతీ 20,460 మంది జనాభాకు ఒక పీజీ సీటు ఉంటే, తెలంగాణలో 12,799 మందికి ఒక పీజీ సీటు చొప్పున ఉన్నదని వివరించారు. కర్ణాటకలో 10,573 మందికి ఒకటి, ఏపీలో 15,079 మందికి ఒకటి, తమిళనాడులో 15,123 మందికి ఒకటి, కేరళలో 18,662 మందికి ఒక పీజీ సీటు చొప్పున ఉన్నాయని పేర్కొన్నారు. ఉత్తరాది రాష్ర్టాల్లో ఈ సంఖ్య నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంటుందన్నారు.

రిజర్వేషన్లపైనా ప్రభావం

సుప్రీంకోర్టు తీర్పుతో ఆయా రాష్ర్టాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కూడా దెబ్బ తినే ప్రమాదమున్నదని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యంగా తెలంగాణలో ఇన్ సర్వీస్ కోటా ప్రశ్నార్థకం అవుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలకు విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక విద్యార్థులకు వైద్య విద్య అందించాలనే ప్రభుత్వాల లక్ష్యాలు నీరుగారుతాయని వివరించారు. 2019 జులై 19న లోక్‌సభలో అప్పటి బీజేపీ ఎంపీ మనోజ్ కోటక్ అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర ఆరోగ్యశాఖమంత్రి హర్షవర్ధన్ బదులిస్తూ 'హెల్త్ ఈజ్ ఏ స్టేట్ సబ్జెక్ట్' అని అన్నారని గుర్తుచేశారు. మెడికల్ కాలేజీలు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నడుస్తాయని, పీజీ విద్యార్థులకు ఇచ్చే వేతనం కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. లోకల్ రిజర్వేషన్ లేకపోతే ప్రభుత్వాలు ఖర్చు చేసేందుకు వెనుకాడుతాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. అంతిమంగా వైద్య రంగంలో మానవ వనరుల కొరత ఏర్పడి, వైద్య సేవలకు విఘాతం కలుగుతుందని వివరించారు. సుప్రీంకోర్టు తీర్పుతో రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరిగే ప్రమాదమున్నదని చెప్పారు. సుప్రీం తీర్పు నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం రాజ్యాంగ ధర్మాసనం వద్ద అప్పీల్ చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం కూడా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీర్పుపై అప్పీల్‌కు వెళ్లాలని డిమాండ్ చేశారు. పీజీ సీట్లలో లోకల్ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు చొరవ తీసుకుని కేంద్రంపై ఒత్తిడి పెంచాలని, అవసరమైతే దక్షిణాది రాష్ర్టాలన్నీ కలిసి రాజ్యాంగ సవరణకు పట్టుబట్టాలని విజ్ఞప్తి చేశారు.

బీసీ విద్యార్థులంటే సర్కార్‌కు లోకువా?

- స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి
- బీసీలమంతా ఐక్యపోరాటం చేస్తాం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి
- హైదరాబాద్‌లో బీసీ విద్యార్థుల శంఖారావం

కవాడిగూడ, జనవరి 30: బీసీ విద్యార్థులంటే కాంగ్రెస్ సర్కార్‌కు లోకువ అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. బీసీలపై వివక్షను విడనాడి, బీసీ విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద బీసీ విద్యార్థుల సమర శంఖారావం మహాసభలో ఆయన ప్రసంగించారు. ఒక బీసీ బిడ్డగా ఈ ప్రభుత్వాన్ని తాను అడుగుతున్నామని, వెంటనే విడుదల చేయకపోతే బీసీలంతా ఒక్కటై ఈ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. విద్యార్థులపై చేసే ఖర్చును పెట్టుబడిగా కాకుండా మానవ వనరుల అభివృద్ధి కోణంలో చూడాలని హితవు పలికారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వ దయాదాక్షిణ్యాలతో కాకుండా విద్యార్థుల హక్కుగా చూడాలని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. ఫీజు బకాయిలు 4,600 కోట్లు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. విద్యార్థుల ఫీజు బకాయిలు ఇవ్వని ప్రభుత్వం.. కాంట్రాక్టర్లకు వేల కోట్లు దోచిపెడుతున్నదని ధ్వజమెత్తారు. విద్యార్థుల పోరాటానికి తమ పార్టీ అండగా ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేశ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్ వివిధ తీర్మానాలను ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. సభలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి

లేదంటే పోరాటమే : హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వారిని వేదనకు గురిచేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతుంటే సర్కార్ మొద్దు నిద్ర నటిస్తుండటం దుర్మార్గమని మండిపడ్డారు. 30 ఏండ్లపాటు ప్రజలకు సేవలందించిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా? వారి ఆవేదన అర్థం కావడం లేదా? అని ప్రశ్నించారు. 2024 మార్చి తర్వాత రిటైరైన దాదాపు ఎనిమిది వేల మంది పీఎఫ్, గ్రాట్యుటీ, ఎల్ఐసీ, కమ్యుటేషన్, సరెండర్‌లీవ్ తదితర ప్రయోజనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రావలసిన ప్రయోజనాలు సకాలంలో రాకపోవడంతో వారు మానసిక వేదనకు గురవుతూ, అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పదవీ విరమణ తరువాత కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో సంతోషంగా ఉండాల్సిన వారికి ప్రభుత్వం ఆ ఆనందాన్ని దూరం చేయడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. హక్కుగా పొందాల్సిన బెనిఫిట్స్ కోసం ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగేలా, పైరవీలు చేసుకోవాల్సిన దుస్థితిని ప్రభుత్వం కల్పించిందని మండిపడ్డారు. బిడ్డ పెండ్లి కోసం ఒకరు, కొడుకు ఉన్నతవిద్య కోసం మరొకరు, భార్య అనారోగ్యం పాలైతే మంచి వైద్య చికిత్స అందించడం కోసం కొందరు ఇలా రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం కండ్లలో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారని వివరించారు.

సిద్దిపేట జిల్లా చేర్యాల మహాధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలి

- ప్రజల మనోభావాలను గుర్తించాలి
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- చేర్యాలలో కదంతొక్కిన అఖిలపక్షం

చేర్యాల, జనవరి 30 : ప్రజల మనోభావాలను గుర్తించి ప్రభుత్వం వెంటనే సిద్దిపేట జిల్లా చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చేర్యాలలో గురువారం రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్యపంతులు ఆధ్వర్యంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో మహాధర్నా, ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్ ఏర్పాటును వెంటనే ప్రకటించకపోతే కాంగ్రెస్ నాయకుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. మొదటి అసెంబ్లీ సమావేశాల్లో చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశాన్ని సభ దృష్టికి తీసుకువచ్చానని, సీఎంతో పాటు మంత్రులకు వినతిపత్రాలు అందించానని గుర్తుచేశారు. అన్ని పార్టీలు చేర్యాల రెవెన్యూ డివిజన్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ ఎందుకు జీవో జారీ చేయడంలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు జేఏసీ ఏర్పాటు చేసుకుని రెవెన్యూ డివిజన్ కోసం పోరాటాలు చేయడం ఎక్కడా చూడలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇన్‌చార్జికి చిత్తశుద్ధి ఉంటే సీఎం వద్దకు వెళ్లి డివిజన్ ఏర్పాటు జీవో తీసుకురావాలని సవాల్ విసిరారు. చేర్యాల డివిజన్ కోసం శాసన మండలిలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేవీఎల్ఎన్‌రెడ్డి మాట్లాడుతూ.. చేర్యాల రెవెన్యూ డివిజన్ విషయమై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

అబద్ధం అద్దం ముందుంటే.. అది రేవంత్

- కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వందేండ్లు వెనుకకు
- పథకాలన్నీ కాంగ్రెస్ వారికే వర్తింపజేసే కుట్ర
- కేసీఆర్ పాలనలో అంతా పారదర్శకంగా సాగింది
- బీఆర్‌ఎస్ ఇచ్చిన పింఛన్‌కు రూపాయి కూడా పెంచలేదు
- సర్కారుపై ఎమ్మెల్సీ కవిత ధ్వజం

నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, పక్కన ఆమె భర్త అనిల్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

ధర్పల్లి, జనవరి 30: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. అబద్ధాన్ని తీసుకుపోయి అద్దం ముందు పెడితే రేవంత్ రూపం కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని అన్నారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం ప్రాజెక్టు రామడుగులో గురువారం కవిత మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ పదేండ్ల పాలనలో నిండైన జల కళ, గాదెల నిండా వడ్లతో అన్ని రకాలుగా తెలంగాణ సిరిసంపదలతో విలసిల్లిందని అన్నారు. కానీ కాంగ్రెస్ పాలనలో భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయని, రాష్ట్రం అన్నిరకాలుగా వెనుకబడుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ మోసపూరిత విధానాలతో రాష్ట్రం వందేండ్లు వెనుకకు వెళ్లే పరిస్థితి నెలకొందని అన్నారు.

హామీల అమలు గాలికి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ గాలికి వదిలేసిందని, ప్రజల సమస్యలను పట్టించుకొనే నాథుడే లేడని కవిత దుయ్యబట్టారు. గతంలో కేసీఆర్ ఇచ్చిన పింఛన్ డబ్బులే తప్ప ఒక్క రూపాయి పెంచలేదని అన్నారు. ఆడబిడ్డలకు రూ.2500 గానీ, రైతులకు బోనస్ రూ.500 గానీ, విద్యార్థినులకు స్కూటీలు గానీ ఇవ్వలేదని మండిపడ్డారు. అసెంబ్లీ స్పీకర్ రెండు రోజుల క్రితం తెలంగాణ ఆర్థిక పరిస్థితి తెలియక హామీలిచ్చామనడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, రేషన్ కార్డులు ఇచ్చే ఆలోచనతో ఉందని అనుమానం వ్యక్తం చేశారు. తాము చెప్పిన వాళ్లకే పథకాలు వస్తాయని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రకటనలు చేస్తున్నారని, ఈ వైఖరి సరికాదని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దని సీఎంగా కేసీఆర్ చెప్పేవారని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ పాలన అంతా అయోమయం, అవినీతిమయంగా మారిందని విమర్శించారు.

పసుపునకు మద్దతు ధర ప్రకటించాలి

పసుపు పంట మార్కెట్‌కు వస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని కవిత కోరారు. ఈ మేరకు ఎంపీ అర్వింద్ చొరవ తీసుకోవాలని సూచించారు. కుంభమేళాకు వెళ్లే వారి కోసం టోల్‌ఫ్రీ నంబర్‌ను తీసుకురావాలని చెప్పారు. ఎల్లారెడ్డి పాఠశాలలో విషాహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురికావడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ పెట్టిన గురుకులాలను నడపడం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాల కోరని, ఆయన గంటకో మాట మారుస్తున్నారని ఆర్టీసీ మాజీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు.

నేడు 'జాగృతి' రౌండ్‌టేబుల్ సమావేశం

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): సాగునీటి ప్రాజెక్టులపై హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నది. 'నీళ్లు-నిజాలు' పేరిట జరగనున్న ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహా పలువురు సాగునీటిరంగ నిపుణులు, విశ్రాంత ఇంజినీర్లు, మేధావులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, తుంగబాలు

కోడ్ ముసుగు రైతు భరోసాకు బ్రేక్?

- సొంత సర్వేలో కాంగ్రెస్ చెంపఛెల్లు
- కేసీఆర్ పాలనే బాగుందని 70 శాతం ఓటింగ్
- బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డిది తుగ్లక్ పాలన అని బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, తుంగ బాలుతో కలిసి ఆయన గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారిక ట్విట్టర్ (ఎక్స్) హ్యాండిల్‌లో ఎవరి పాలన బాగుందని సర్వే నిర్వహిస్తే కేసీఆర్ పాలనే బాగుందని 70 శాతం మంది నెటిజన్లు ఓటు వేశారని తెలిపారు. దాదాపు 90 వేల మంది ఈ ఓటింగ్‌లో పాల్గొనట్టు చెప్పారు. సొంత పార్టీ సర్వేలోనే నెటిజన్లు కాంగ్రెస్ చెంప ఛెల్లుమనిపించారని చెప్పారు. 10 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడానికి సునీల్ కనుగోలు ప్రధాన సూత్రధారి అని, ఇప్పుడు ఓటింగ్ పెట్టి ఆయనే అభాసుపాలయ్యారని విమర్శించారు. ఆరు నెలల దాకా ఎన్నికల కోడ్ పేరు చెప్పి రైతు భరోసాను ఆపే కుట్ర జరుగుతున్నదని విమర్శించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో సుమారు 40 వేల మందికి ఇండ్లు లేవని రేవంత్‌రెడ్డి సర్కారు ప్రకటించిందని తెలిపారు. కానీ, కేవలం 830 ఇండ్లు మాత్రమే మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎవరి సంతకం లేకుండానే సంక్షేమ పథకాల మంజూరు లేఖలు ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల ఇండ్లకు మంజూరు పత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. హుజూరాబాద్‌లో దళితబంధు రెండో విడత నిధులు మంజూరు చేయడం బీఆర్‌ఎస్ సాధించిన విజయం అని పేర్కొన్నారు. గుంట భూమి కూడా లేని ప్రతిఒక్కరికీ ఆత్మీయ భరోసా అందించాలని కోరారు.

తెలంగాణ భవన్‌లో స్లోవేకియా యువకులు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): భారత్‌లోని ప్రముఖ నగరాల్లో పర్యటిస్తున్న స్లోవేకియా దేశ యువకులు మైఖేల్, వైబీరవో బంజారాహిల్స్‌లోని తెలంగాణభవన్‌ను గురువారం సందర్శించారు. బీఆర్‌ఎస్ కార్యాలయమంతా కలియతిరిగి పార్టీ అధినేత కేసీఆర్, తెలంగాణ తల్లి విగ్రహం గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సాధన ఉద్యమ ఫొటోలకు సంబంధించిన వివరాలను కార్యాలయ సిబ్బంది వివరించారు. తెలంగాణ భవన్ సందర్శన తమకు పూర్తి సంతృప్తినిచ్చిందని స్లోవేకియా యువకులు తెలిపారు.

అల్లు అర్జున్‌కో న్యాయం? కిషన్‌రెడ్డికి ఇంకో న్యాయమా?

- 'మహాహారతి'లో ఇద్దరు మృత్యువాత
- కిషన్‌రెడ్డిపై ఎందుకు కేసు పెట్టలేదు
- బీసీ బిడ్డల ప్రాణాలకు విలువ లేదా?
- బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): సినీనటుడు అల్లు అర్జున్‌కు ఒక న్యాయం? కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మరో న్యాయమా? అని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. సంధ్య థియేటర్ ఘటనకు ఒకలా, హుస్సేన్‌సాగర్ ఘటనకు మరోలా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు స్పందిస్తున్నదని నిలదీశారు. బీసీ బిడ్డలు గణపతి, అజయ్ ప్రాణాలు.. రేవతి ప్రాణాల విలువ ఒకటి కాదా? రేవంత్‌రెడ్డికి, బీజేపీ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మధ్య అనుబంధం ఏమిటి? అని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. సంధ్య థియేటర్ కేసులో మహిళ చనిపోతే ఏ-11గా ఉన్న అల్లు అర్జున్‌ను జైలుకు పంపారని, అలాంటప్పుడు భారతమాత మహాహారతి ఘటనలో ఇద్దరు వ్యక్తులు చనిపోతే ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు కేసు పెట్టలేదని నిలదీశారు. కిషన్‌రెడ్డి ఈ ఘటనకు బాధ్యుడు కారా? కిషన్‌రెడ్డి స్ఫూర్తితో నడుస్తున్న భారత మాత ఫౌండేషన్ ఈ కార్యక్రమానికి పోలీస్ పర్మిషన్ తీసుకున్నదా? అని ప్రశ్నించారు. 'ఈ ఘటనలో ఇంతవరకు ఒక్క నిందితుడిని కూడా ఎందు కు అరెస్టు చేయలేదు? హుస్సేన్‌సాగర్‌లోకి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా బాంబు లు పేల్చడానికి అనుమతి ఇచ్చింది ఎవరు? ఆ అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు. దీనికి టూరిజం అధికారుల అనుమతి ఉన్నదా? అగ్నిమాపక శాఖ అనుమతి తీసుకున్నారా? సీఎంగా రేవంత్‌రెడ్డి ఈ ఘోర ఘటనపై ఎందుకు మౌనంగా ఉన్నారు?' అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం, హోంమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి ఈ ఘటనపై స్పందించాలని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

మళ్లీ మన కేసీఆర్ వస్తడు

రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దు: చల్లా ధర్మారెడ్డి

- కాంగ్రెస్ ప్రభుత్వంలోనే 420 మంది రైతు ఆత్మహత్యలు
- రైతు ఆత్మహత్యలు జరగకూడదనే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కమిటీ



సంగెం, జనవరి 30 : మళ్లీ మన కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది.. రైతులు ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. వరంగల్ జిల్లా సంగెంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతు ఆత్మహత్యలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 420 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు జరుగకూడదని, రైతులకు భరోసా కల్పించేందుకే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారని చెప్పారు. సంగెం మండలం పల్లార్‌గూడ మహారాజ్‌తండాలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు బానోత్ తిరుపతి కుటుంబాన్ని కమిటీ సభ్యులు, మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించే కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సాకుతో రద్దు చేయించారని మండిపడ్డారు. ఈ పర్యటన జరిగితే కాంగ్రెస్ కనుమరుగవుతుందని భయపడి పోలీసులపై ఒత్తిడి తెచ్చారని చెప్పారు. రైతు బీమా, రైతుబంధు, అందుబాటులో ఎరువులు, విత్తనాలు, 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చి పండిన పంటలకు మద్దతు ధరతో కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని గుర్తుచేశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానన్న రేవంత్‌రెడ్డి ఆనవాళ్లే లేకుండా అయ్యే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని చెప్పారు. పల్లార్‌గూడలో జరిగే సమావేశాన్ని కోర్టు అనుమతితో ఫిబ్రవరి 1న నిర్వహించుకుంటామని తెలిపారు.